



Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

శుక్రవారం 13-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :145 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

శ్రీకాళహస్తి ఆలయంలో భారీ అగ్నిప్రమాదం



అన్నప్రసాద వంటశాలలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం: అధికారులు

భయంతో పరుగులు తీసిన భక్తులు

మంటలను అదుపు చేసిన ఆలయ సిబ్బంది

వంటశాలకే పరిమితమైన ఆస్తి నష్టం

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

గృహజ్యోతికి డబుల్ ధమాకా!

54.79 లక్షల కుటుంబాలకు ట్రూఅప్ ఊరట

గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులే

ట్రూఅప్ ఛార్జీలను భరించనున్న ప్రభుత్వం

ఈ నెలలోనే రూ.16 కోట్ల అదనపు భారం

24 నెలల్లో రూ.500 కోట్ల చెల్లింపులు

నెలకు రూ.210 కోట్లకు చేరిన ఖర్చు

కొత్త లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

200 యూనిట్లలోపు వినియోగదారులకు ప్రయోజనం



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం):
తెలంగాణలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలపై ట్రూఅప్ ఛార్జీల భారం పడకుండా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హత పొందిన 54,79,383 విద్యుత్ కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే డిస్కంలకు చెల్లించనుంది. దీంతో ఈ నెల నుంచి అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీలు అదనంగా చేరుతున్నప్పటికీ గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం యథావిధిగా జీరో బిల్లులే జారీ అవుతున్నాయి.

సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీలను ఇప్పుడు వసూలు చేస్తున్నాయి. ఈ నెల బిల్లులో యూనిట్‌కు 30 పైసలు చొప్పున, వచ్చే నెల నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున మొత్తం 24 నెలలపాటు ఈ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నాయి. అయితే గృహజ్యోతి పథకం కింద ప్రస్తుతం ఉచిత విద్యుత్ పొందుతున్న కుటుంబాలకు ఈ భారం వర్తించకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీపై వివాదం

సోషల్ మీడియాలో పాత పత్రాలు వైరల్

2022-23లోనే పార్టీ రిజిస్ట్రేషన్?

ఈసీకి సమర్పించిన ఆడిట్ నివేదికలు

పార్టీ అధ్యక్షుడిగా ముకేష్ పేరు

మహేష్ కుమార్ నుంచి రూ.లక్ష విరాళం

పత్రాల్లో విజయసాయి పేరు, సంతకం కరువు

ఒకే పేరుతో రెండు పార్టీలున్నాయా?

విజయసాయి రెడ్డి వివరణపై ఉత్కంఠ

2 లో

యూపీ బరిలో కొత్త కూటమి!

యూపీ సీఎం అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్

కొత్త కూటమిని ప్రకటించిన ఒవైసీ

'సామాజిక పరివర్తన మోర్చా' ఏర్పాటు

బీజేపీ హ్యాట్రిక్‌కు అడ్డుకట్టే లక్ష్యం

దళితులు, బీసీల సంక్షేమమే ఎజెండా

నిరుద్యోగం, రైతు సమస్యలపై పోరాటం

నవంబర్ 26న భారీ బహిరంగ సభ



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం):
ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. 2027లో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల కోసం ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక ప్రకటన చేశారు. తాజాగా ఏర్పాటు చేసిన 'సామాజిక పరివర్తన మోర్చా' తరఫున యూపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను ఒవైసీ అధికారికంగా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ రాజధానిలో చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి గురువారం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఒవైసీ ఈ సంచలన ప్రకటన చేశారు. యూపీలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ కూటమి ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

భారత్ సమ్మిట్ కాదు.. వ్యతిరేక సమ్మిట్!

భారత్ సమ్మిట్‌పై కిషన్ రెడ్డి ఫైర్

ప్రభుత్వ సొమ్ముతో కాంగ్రెస్ కార్యక్రమమా?

భారత వ్యతిరేక సమ్మిట్ అంటూ విమర్శలు

మోడీపై తప్పుడు ఆరోపణలకే వేదిక

రాహుల్ గాంధీ విజన్ ఏదని ప్రశ్న

తెలంగాణ హామీలపై సమాధానం చెప్పాలి

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఏవీ?

2 లో

మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం!

23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు

నవంబర్ 14న నోటిఫికేషన్ విడుదల

16 వరకు నామినేషన్ల స్వీకరణ

నవంబర్ 26న పోలింగ్ నిర్వహణ

30న ఓట్ల లెక్కింపు, ఫలితాలు

2 లో

నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లో పోరు

శబరిమలలో ట్రాన్స్‌జెండర్లకు నో ఎంట్రీ..



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం):
శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి ప్రవేశం కల్పించాలంటూ ఓ ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ ప్రభుత్వం గట్టిగా వ్యతిరేకించింది. పిటిషనర్ తన లింగాన్ని స్పష్టంగా నిర్ధారించే వైద్య లేదా అధికారిక ధ్రువీకరణ పత్రాలను సమర్పించకపోతే ఆలయంలోకి అనుమతించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది.



వికసిత్ భారత్..

మోదీ మాస్టర్ ప్లాన్!

న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): ప్రజాస్వామ్యంలో మీడియా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మీడియా సానుకూల ధోరణితో పనిచేస్తూ దేశాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రపంచానికి భారతదేశ విజయగాథను వినిపించే దిశగా మీడియా కృషి చేయాలని సూచించారు. భారత్ సాధిస్తున్న విజయాలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తుల విజయాలపై ప్రత్యేక కథనాలు ప్రచురించాలని కోరారు. ఇదే దేశానికి మీడియా అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మోదీ ముచ్చటిస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

మిగతాది 2 లో..

- 2047 నాటికి వికసిత్ భారత్
- దేశాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకం
- భారత్ విజయగాథను ప్రపంచానికి చాటాలి
- డ్రగ్స్ రహిత భారత్‌కు ప్రచారం
- 12 ఏళ్లలో దేశంలో ఎన్నో మార్పులు
- పేదరికం నుంచి 50 కోట్ల మందికి విముక్తి
- ఫీల్డ్ రిపోర్టర్లకు మోదీ ప్రశంసలు
- టెక్నాలజీతో మారిన మీడియా స్వరూపం

క్యాబ్స్ వెనుక కుట్ర కోణం!

గ్రీన్ క్యాబ్స్‌పై బీఆర్ఎస్ భగ్గు

'పార్ట్‌నర్' పేరుతో బెనిఫిట్స్‌కు కోత

డ్రైవర్ల పొట్టకొట్టే కుట్ర: ఆర్ఎస్పీ

వారానికి 500 కిలోమీటర్ల నిబంధన

రూ.8 వేల నుంచి రూ.వెయ్యికి కోత?

6 లక్షల మంది డ్రైవర్లకు ముప్పు

ఏఐసీసీకి మూటలు ముట్టజెప్పారంటూ ఆరోపణ



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): వియత్నాం దేశానికి చెందిన 'గ్రీన్ ఎస్ఎం' ఎలక్ట్రిక్ క్యాబ్స్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దేశీయ రోడ్లపైకి ఎంట్రీ ఇచ్చిన ఈ క్యాబ్‌లు ఛార్జీల పరంగా ప్రయాణికులకు తీపి కబురు అందిస్తుంటే, స్థానిక క్యాబ్, టాక్సీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్ల అస్తిత్వానికి పెను సవాలు విసురుతున్నాయి. ఇప్పటికే బెంగళూరులో ఈ ఎలక్ట్రిక్ ట్యాక్సీలకు వ్యతిరేకంగా స్థానిక యూనియన్లు నిరసనలు చేపట్టగా, ఇప్పుడు తెలంగాణలోనూ ఈ 'గ్రీన్ క్యాబ్స్' రాజకీయంగా హీట్ పెంచుతున్నాయి. 'డ్రైవర్ నహీ.. పార్ట్‌నర్ బనో' అనే నినాదంతో రోడ్లపైకి వచ్చిన గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

అండాల దందా కింగ్‌పిన్ అరెస్ట్



సైదాబాద్‌కు చెందిన ప్రవీణ్ అరెస్ట్ 2 లో

ల్యాప్‌టాప్, రెండు ఫోన్లు స్వాధీనం

నకిలీ ఆధార్‌లతో అండాల సేకరణ

ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్ల టర్నోవర్

ఇప్పటివరకు 13 మంది నిందితుల అరెస్ట్

21 ఐవీఎఫ్ కేంద్రాలపై పోలీసుల నజర్

ఐదు రోజుల పోలీసు కస్టడీకి నిందితులు

22ఎ భూములకు విముక్తి.. పొంగులేటి కీలక ఆదేశాలు!

ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండొద్దు

కలెక్టర్లదే పూర్తి బాధ్యత

ప్రతి వారం ప్రత్యేక సమీక్ష

కోర్టు అంశాలపై వారంలో నివేదిక

అర్హులైన భూ యజమానులకు ఊరట

కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తొలగించాలి



ఖమ్మం, 11 నవంబర్ (ఇది కద నిజం):
ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్షించారు.

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శుక్రవారం 13-11-2026

22ఎ భూములకు విముక్తి.. పొంగులేటి కీలక ఆదేశాలు!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 22-ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు.

కలెక్టర్లదే బాధ్యత

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22-ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోర్టు అంశాలపై నివేదిక

యూఎల్సీకి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 22-ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

క్యాబ్స్ వెనుక కుట్ర కోణం!

మొదటి పేజీ తరువాయి

ఆ బెనిఫిట్స్ ఎగ్గొట్టేందుకే 'పార్ట్‌నర్' కుట్ర:

గ్రీన్ క్యాబ్స్ అంశంపై గురువారం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'డ్రైవర్ నహీ.. పార్ట్‌నర్ బనో' అనే నినాదంలోనే పెద్ద మతలబు ఉందని ఆయన ఆరోపించారు. సంస్థలో డ్రైవర్‌గా పెట్టుకుంటే జీతం, ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని, అదే 'పార్ట్‌నర్' పేరుతో చేర్చుకుంటే అవన్నీ ఇవ్వాల్సిన అవసరం ఉండదని, అందుకే ఈ కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. పైగా, వారం రోజుల్లో 500 కిలోమీటర్లు నడిపించాలని షరతు పెట్టారని, లేదంటే డబ్బులు రావని అన్నారు. మొదట వారానికి రూ.8,000 ఇస్తామని ఆశ చూపి, మెల్లమెల్లగా దాన్ని రూ.1,000కి పరిమితం చేస్తారని ఆరోపించారు. ఒక విదేశీ కంపెనీ తన అడ్వర్టైజింగ్ కోసం స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తోందని, ఇదంతా చూసి కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆ సంస్థకు ఎలా అనుమతి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీ ఏఐసీసీకి మూటలు ముట్టజెప్పారా?:

"గ్రీన్ ఎస్ఎం కంపెనీకి పర్మిషన్ ఇచ్చింది ఎవరు? మాకున్న సమాచారం ప్రకారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మూటలు అప్పజెప్పి ఆ కంపెనీ తెలంగాణకు వచ్చింది" అని ఆర్ఎస్పీ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 6 లక్షల మంది క్యాబ్, ఆటో డ్రైవర్ల మీద రేవంత్ రెడ్డి ఎందుకు కక్షగట్టారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల 6 లక్షల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆకలి చావుల అంచున ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ జేబులు నింపుకోవడానికే కాంగ్రెస్ నాయకులు పని చేస్తున్నారని, వియత్నాం క్యాబ్ కంపెనీని తెచ్చి ఇక్కడి డ్రైవర్ల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే కర్ణాటకలో ఈ గ్రీన్ క్యాబ్స్‌పై వివాదం చెలరేగగా, ఇప్పుడు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయ విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ, గ్రీన్ ఎస్ఎం సంస్థ ఏ విధంగా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

ముంచుకొస్తున్న తుఫాన్ గండం!



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి మరోసారి తుఫాన్ ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాగల 24 గంటల్లో దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 15వ తేదీ నాటికి మరింత బలపడి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో రాబోయే రోజుల్లో సముద్రం అల్లకల్లోలంగా మారనుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు ముందస్తు సూచనలు చేస్తున్నారు.

తీరం వైపు మరింత వేగంగా..

వాయుగుండంగా మారిన అనంతరం ఇది మరింత వేగంగా తీరం వైపు దూసుకురానుంది. తీరానికి చేరువయ్యే సమయంలో సముద్రంలోని వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలిస్తే, ఇది తీవ్ర తుఫానుగా కూడా రూపాంతరం చెందే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీర ప్రాంతాల మధ్య ఇది తీరాన్ని దాటే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఒకవేళ ఇది తుఫానుగా బలపడితే తీర ప్రాంతాల్లో గంటకు 70 నుండి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ఛాన్స్..

ఈ తుఫాన్ ప్రభావం వల్ల దక్షిణ కోస్తా జిల్లాల్లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే గత వర్షాల కారణంగా తడిసిముద్దయిన పంట పొలాలకు ఈ కొత్త ముప్పు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తనిష్క్‌లో భారీ చోరీ.. రూ.50 కోట్ల నగలు అపహరణ..



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడులోని మదురైలో భారీ చోరీ కలకలం రేపింది. పళంగనాథం ప్రాంతంలోని ప్రముఖ జువెలరీ బ్రాండ్ తనిష్క్ షోరూమ్‌లో దుండగులు అత్యంత చాకచక్యంగా ప్రవేశించి సుమారు రూ. 50 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను దోచుకెళ్లారు. 15 నుంచి 20 కిలోల వరకు బంగారం చోరీకి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ షోరూమ్ భవన నిర్మాణ పనులు సుమారు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కేవలం 10 నుంచి 15 రోజుల క్రితమే ఈ నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. షోరూమ్ వెనుక వైపు తలుపులు, షట్టర్ తాళాలను పగలగొట్టడంతో పాటు షాపు గోడకు కన్నం వేసి దొంగతనానికి పాల్పడినట్లు నిర్వాహకులు గుర్తించారు.

11వ తేదీ ఉదయం సిబ్బంది షోరూమ్‌కు తిరిగి వచ్చినప్పుడు తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా, ఆభరణాలు మాయమైనట్లు తేలింది. వెంటనే షోరూమ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

పోలీసులు షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అందులో ఒకే ఒక్క అనుమానితుడు భవనం పైఅంతస్తులోని లిఫ్ట్ మార్గం (లిఫ్ట్ ష్యాసేజ్) ద్వారా లోపలికి ప్రవేశించినట్లు రికార్డయింది. కొత్తగా ప్రారంభమైన షోరూమ్‌లో నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగ ఈ పథకం వేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. చోరీకి గురైన బంగారం, వజ్రాల కచ్చితమైన పరిమాణం, విలువపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

శబరిమలలో ట్రాన్స్‌జెండర్లకు నో ఎంట్రీ..

ఈ అంశంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) తీసుకున్న నిర్ణయానికే తాము కట్టుబడి ఉన్నామని కేరళ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

హైకోర్టుకెక్కిన ట్రాన్స్‌జెండర్

తమిళనాడుకు చెందిన సత్యశ్రీ షర్మిళ రహమతాలి అనే ట్రాన్స్‌జెండర్ మహిళ శబరిమల దర్శనానికి అనుమతి కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. తాను అయ్యప్ప భక్తురాలినని, ఆచారాల ప్రకారం మాల ధరించి గతంలో జనవరి 3, ఏప్రిల్ 15 తేదీల్లో స్వామివారిని దర్శించుకున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం క్రతువులు పూర్తి చేసిన ట్రాన్స్‌జెండర్లకు ఆలయ ప్రవేశం కల్పించాలని కోరారు.

పత్రాలు లేకుంటే ఆచారాలకు విరుద్ధం: టీడీబీ

ఈ పిటిషన్‌పై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కోర్టుకు తన వాదనలను వినిపించింది. ఒక వ్యక్తి మహిళా లేక ట్రాన్స్‌జెండరా అన్న విషయాన్ని తేల్చే అధికారం గానీ, వారి శారీరక లక్షణాలను పరిశీలించే హక్కు గానీ తమకు లేదని బోర్డు స్పష్టం చేసింది. చట్టబద్ధమైన వైద్య సంస్థ జారీ చేసిన సర్టిఫికెట్ సమర్పిస్తేనే అనుమతిపై ఆలోచించగలమని, లేనిపక్షంలో అది ఆలయ సంప్రదాయాలకు విరుద్ధమవుతుందని పేర్కొంది. మరోవైపు, శబరిమల ఆలయ ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్నందున, ప్రస్తుత పరిస్థితుల్లో తాము బోర్డు వైఖరికి భిన్నంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని కేరళ సర్కార్ హైకోర్టుకు నివేదించింది.

అసలు వివాదం ఏంటి?

గతంలో రెండుసార్లు శబరిమలకు వెళ్లిన పిటిషనర్.. ఆగస్టు 20న మరోసారి యాత్రకు బయలుదేరారు. అయితే, పంబా గణపతి ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు ఆమెను అడ్డుకుని ఆలయ నిబంధనలను వివరించారు. ఆ తర్వాత ఆగస్టు 26న తిరుఓణం పర్వదినం సందర్భంగా దర్శనానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆమె కేరళ సీఎస్, ఉన్నత పోలీసు అధికారులు, టీడీబీ అధికారులకు వినతిపత్రాలు అందించారు. దీనిపై స్పందించిన అధికారులు.. తమిళనాడులోని అధికారుల నుంచి జారీ అయిన లింగ మార్పిడి, వైద్య స్థితి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించినట్లు టీడీబీ కోర్టుకు తెలిపింది.

అండాల దందా కింగ్‌పిన్ అరెస్ట్

న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): నగరంలో సంచలనం సృష్టించిన అక్రమ మానవ అండాల సేకరణ రాకెట్‌లో దర్యాప్తు వేగవంతమైంది. ఈ అక్రమ దందాలో కీలక నిందితుడిగా ఉన్న సైదాబాద్‌కు చెందిన మునగపాటి ప్రవీణ్ ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు ప్రవీణ్ నుంచి ఓ ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ఆధార్ కార్డులను సృష్టించి, వాటి ఆధారంగా యువతులు, మహిళల నుంచి పలుమార్లు అండాలను సేకరిస్తున్న ఈ ముఠా నెట్‌వర్క్‌ను పోలీసులు ఒక్కొక్కరిగా ఛేదిస్తున్నారు.

కోట్ల రూపాయల టర్నోవర్.. నకిలీ పత్రాల గుట్టురట్టు

అయితే, నిందితులు ఎలాంటి అనుమతులు లేకుండా, పలు నకిలీ పత్రాలు సృష్టించి మహిళల నుంచి అక్రమంగా అండాలను సేకరిస్తూ కోట్ల రూపాయల దందాకు పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక్కో ఏఆర్‌టీ కేంద్రానికి ఏడాదికి రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 13 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ రాకెట్‌తో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తోన్న సుమారు 21 ఐవీఎఫ్ కేంద్రాలపై పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే పలువురు అనుమానిత కేంద్రాలపై దాడులు నిర్వహించి, సోదాలు చేపట్టి కీలక సమాచారాన్ని సేకరించారు.

5 రోజుల పోలీసు కస్టడీకి నిందితులు

అక్టోబర్ 31న వెలుగు చూసిన ఈ ఉదంతానికి సంబంధించి బేగంపేట, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. బేగంపేట పోలీసులు నమోదు చేసిన కేసులో అమిత్ శర్మ, నిఖిత్ పర్వీన్, రేష్మ ఖాతూన్, మేఘావత్ శ్రీనివాస్, ఎస్కే పర్వీన్, విజయ్ భాగ్యరావు, పంకజ్ సోనిలతో పాటు సరూర్‌నగర్ పరిధిలో అరెస్టయిన దుర్గాప్రసాద్‌ను పీటీ వారెంట్‌పై బేగంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో బుధవారమే జైలు నుంచి వీరందరినీ కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, గురువారం నుంచి ఐదు రోజుల పాటు కూపీ లాగనున్నారు. ప్రధాన నిందితులను కస్టడీలో విచారించడం ద్వారా ఈ అక్రమ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, ఏయే ఐవీఎఫ్ కేంద్రాలు ఈ అక్రమ దందాకు సహకరించాయనే విషయాలపై మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

శ్రీకాళహస్తి ఆలయంలో భారీ అగ్నిప్రమాదం

న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి ఆలయంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.. ఆలయంలోని అన్నప్రసాద ప్రధాన వంటశాలలో ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. ఒక సిలిండర్ పేలిన వెంటనే పక్కనే ఉన్న ఇతర సిలిండర్లకు సైతం మంటలు వ్యాపించాయి.. దీంతో వంటశాలలో భారీగా మంటలు ఎగిసి పడ్డాయి.. పేలుడు శబ్దంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురై పరుగులు తీశారు.. మరోవైపు పొటులో ప్రసాదాలు తయారు చేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు.. మంటలను అదుపు చేసేందుకు ఆలయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై తాజాగా ఆలయ అధికారులు వివరణ ఇచ్చారు. వంటలు పూర్తయ్యాక.. మంటలు ఆర్పే ముందు షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు స్పష్టం చేశారు. "వెంటనే అగ్నిమాపక యంత్రం ఇచ్చింది. మా దగ్గర ఉన్న సామాగ్రితో మంటలను అదుపు చేశాం. ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం లేదు. ఆస్తి నష్టం కూడా ఓన్లీ ఆ వంటశాల వద్ద మాత్రమే జరిగింది. సాయంత్రం వంటలు రెడీ చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తున్నాం." అని స్పష్టం చేశారు.

వికసిత్ భారత్.. మోదీ మాస్టర్ ప్లాన్!

మొదటి పేజీ తరువాయి

మీడియా వార్తలకు డెడ్‌లైన్ ఉన్నట్లుగానే వికసిత్ భారత్ సాధించేందుకు కూడా 2047 అనే లక్ష్య గడువు ఉందని వ్యాఖ్యానించారు. ఈ లక్ష్య సాధన కోసం చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. దేశం పెట్టుకున్న ఏ లక్ష్యమూ అసాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. అయితే, డ్రగ్స్ రహిత భారత్, దేశ ఐక్యతపై కథనాలు రావాలి.. దేశాన్ని డ్రగ్స్ విముక్తంగా మార్చడం, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం, వికసిత్ భారత్ లక్ష్య సాధన వంటి కీలక అంశాలకు మీడియా తన కథనాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని మోదీ సూచించారు. దేశంలో జరుగుతున్న సానుకూల మార్పులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ప్రపంచ వేదికపై భారత్ సాధిస్తున్న విజయాలను అంతర్జాతీయ సమాజానికి వివరించేలా వార్తలు, కథనాలు ఉండాలని ఆకాంక్షించారు.

12 ఏళ్లలో దేశంలో ఎన్నో మార్పులు

గత 12 ఏళ్లలో భారత్‌లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని మోదీ వివరించారు. ఒకప్పుడు కనీసం మట్టి రోడ్డు వేయాలని వినతిపత్రాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. రైల్వే వ్యవస్థలో పూర్తిస్థాయిలో విద్యుదీకరణ చేపట్టామని తెలిపారు. గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని అత్యంత పేదరికం నుంచి బయటకు తీసుకురాగలిగామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఇక, కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి క్షేత్రస్థాయిలో పూర్తి అంకితభావంతో పనిచేసే ఫీల్డ్ రిపోర్టర్ల కృషి తనకు ఎంతో స్ఫూర్తినిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. చిన్న, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా అందరూ పనిచేయాలని సూచించారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.

మీడియాతో గత అనుభవాలను గుర్తుచేసుకున్న మోదీ

ఈ సందర్భంగా మీడియాతో తనకున్న అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. బ్రేకింగ్ న్యూస్ కోసం పరుగులు తీసే మీడియా ప్రతినిధులు నాన్ బ్రేకింగ్ న్యూస్ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందని చమత్కరించారు. గతంలో కనీసం ప్రెస్ రిలీజ్ పంపించడానికి కూడా కష్టపడాల్సిన రోజులను చూశానని తెలిపారు. అప్పట్లో మీడియా ప్రతినిధులతో మంచి ఆత్మీయ సంబంధాలు ఉండేవని, ఆ అనుభవాల నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. రిపోర్టర్ నుంచి ఎడిటర్‌గా మారినట్లుగా తన బాధ్యతలు కూడా మారాయని మోదీ వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన ఓ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. ఒకసారి మహిళా ప్రతినిధుల బృందం తన వద్దకు వచ్చి, తాను ముఖ్యమంత్రి కాబోతున్నానని, ఆ సందర్భంగా మిఠాయి తినిపించాలని కోరిందని తెలిపారు. తనకంటే ముందే వారికి ఈ విషయం తెలిసిందని సరదాగా చెప్పారు. ఆ తర్వాత కాలంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు.

టెక్నాలజీతో మారిన మీడియా స్వరూపం

కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మీడియా స్వరూపం పూర్తిగా మారిపోయిందని ప్రధాని మోదీ అన్నారు. అదే సమయంలో మీడియా రంగంలో సవాళ్లు కూడా పెరిగాయని పేర్కొన్నారు. ఒకప్పుడు వార్తల సేకరణకు పెద్ద పెద్ద పరికరాలు అవసరమయ్యేవని, ఇప్పుడు మొబైల్ ఫోన్‌నే ఓబీ యూనిట్‌గా ఉపయోగించే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా మీడియా కూడా ముందుకు సాగాలని సూచించారు. దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య బలోపేతం, జాతీయ ఐక్యత వంటి అంశాల్లో మీడియా మరింత చురుకైన పాత్ర పోషించాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీపై వివాదం

న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం):



PARIVARTAN RAJNITI PARTY

CONTRIBUTION REPORT

మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి కొత్తగా ప్రారంభించిన 'పరివర్తన రాజనీతి పార్టీ' చుట్టూ సోషల్ మీడియా వేదికగా అప్పుడే జోరుగా చర్చ మొదలైంది. ఆయన ఈ పార్టీని ప్రకటించిన నేపథ్యంలో, ఇదే పేరుతో కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించినట్లుగా ఉన్న కొన్ని పాత పత్రాలు సోష్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ పత్రాల్లో 'పరివర్తన రాజనీతి పార్టీ'కి సంబంధించిన 2023-2024 ఆర్థిక సంవత్సరం వార్షిక ఆడిట్ నివేదిక, విరాళాల రిపోర్టులు ఉన్నాయి. వైరల్ అవుతున్న ఆ లేఖల ప్రకారం, ఈ పార్టీకి 'ముకేష్' అనే వ్యక్తి అధ్యక్షుడిగా ఉన్నారు. ఢిల్లీలోని ఈస్ట్ వినోద్ నగర్ చిరునామాతో ముకేష్ లోక్ అనే వ్యక్తి పేరుతో ఉన్న ఇమెయిల్ ఐడీ (MUKESHALOK1989@GMAIL.COM) రిజిస్టర్ అయి ఉంది. అలాగే, 2023-2024 సంవత్సరానికి గాను మహేష్ కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.1,00,000 విరాళం అందినట్లు ఆ విరాళాల నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు.

తేదీలు, సంతకాలపై ఆసక్తికర చర్చ..

ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైన ఈ డాక్యుమెంట్లపై ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం అక్టోబరు 09, 2024న స్వీకరించినట్లుగా స్టాంప్, సంతకాలు కనిపిస్తున్నాయి. అంతకుముందే అంటే సెప్టెంబరు 25, 2024న చార్టర్డ్ అకౌంటెంట్ ఆ పత్రాలపై సంతకం చేసినట్లుగా తేదీలు తెలుపుతున్నాయి. వైరల్ అవుతున్న లేఖల ప్రకారం, 'పరివర్తన రాజనీతి పార్టీ' రిజిస్ట్రేషన్ సంఖ్య 56/216/2022-2023/PPS-IV గా నమోదై ఉంది. దీన్ని బట్టి ఈ పార్టీ 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే భారత ఎన్నికల సంఘం వద్ద రికార్డయినట్లుగా తెలుస్తోంది. విజయసాయి రెడ్డి నిన్న ఈ పేరుతో కొత్త రాజకీయ ప్రయాణం ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటించినప్పటికీ, ప్రచారంలో ఉన్న రికార్డులు మాత్రం 2022-2024 మధ్య కాలానికి చెందినవిగా ఉండటం గమనార్హం.

క్లారిటీ ఇస్తారా..?

ఎన్నికల సంఘానికి సమర్పించినట్లుగా చెబుతున్న ఆ లేఖలు, ఆడిట్ నివేదికల్లో ఎక్కడా విజయసాయి రెడ్డి పేరు కానీ, ఆయన సంతకం కానీ, హోదా ప్రస్తావన కానీ లేవు. పార్టీ అధ్యక్షుడిగా ముకేష్ సంతకం మాత్రమే వాటిపై ఉంది. విజయసాయి రెడ్డి ప్రకటించిన పార్టీ పేరుతోనే 2024 అక్టోబరులో దాఖలైన ఈ పత్రాలు బయటకు రావడంతో, ఇప్పటికే రిజిస్టర్ అయి ఉన్న పార్టీ పేరును ఆయన తీసుకున్నారా.. లేక ఇది ఒకే పేరుతో ఉన్న మరో పార్టీకి చెందిన డాక్యుమెంట్లా అనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది.

యూపీ బరిలో కొత్త కూటమి!

మొదటి పేజీ తరువాయి

బలమైన ప్రత్యామ్నాయం.. అసదుద్దీన్ ఒవైసీ

ఈ సందర్భంగా ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ హ్యాట్రిక్ విజయాలను అడ్డుకోవడానికి మా కూటమి ఓ బలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని తాను పూర్తి విశ్వాసంతో చెబుతున్నానని అన్నారు. దళితులు, వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాలను గతంలో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని ఆయన మండిపడ్డారు. కులాలకతీతంగా ఈ వర్గాల సంక్షేమం కోసమే తమ మోర్చా పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న విద్యా వ్యవస్థ, యువతలో నిరుద్యోగం, రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను తమ కూటమి ప్రధాన ఎజెండాగా తీసుకుంటుందని వెల్లడించారు. రాష్ట్రంలో సామాజిక మార్పు కోసం జరిగే ఉద్యమానికి నాంది పలుకుతూ నవంబర్ 26న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ,

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 13-11-2026

కుక్కునూరులో కూటమి
విజయోత్సవ సంబరాలు

- గెలిచిన వారికే కాదు.. పోరాడిన వారికీ గౌరవం
- టీడీపీ అధ్యక్షుడు నాగు ఆధ్వర్యంలో ఘన సత్కారం



ఇది కద నిజం, కుక్కునూరు: మండలంలో కూటమి సాధించిన విజయాలతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాలను పురస్కరించుకుని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) ఆధ్వర్యంలో గురువారం కుక్కునూరు మండల టీడీపీ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు, ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలకు గాను కూటమి ఏడు స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు జడ్పీటీసీ స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసింది. ఈ నేపథ్యంలో కూటమి తరఫున జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. విజయం సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించడంతో పాటు, గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపునిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో కూటమి విజయానికి అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తలను అభినందించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో సాధించిన విజయం ఏ ఒక్కరి వల్లనో సాధ్యపడలేదని, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల ఐక్యత, సమష్టి కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. ఇదే స్ఫూర్తి, ఐక్యతను కొనసాగిస్తూ రానున్న రోజుల్లో కుక్కునూరు మండల అభివృద్ధికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి పంచాయతీలో ఎర్రజెండా ఎగరాలి!

- సిపిఐ శ్రేణులకు మండల కార్యదర్శి లక్ష్మయ్య పిలుపు



ఇది కద నిజం, కుక్కునూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తన బలాన్ని నిరూపించుకుని సత్తా చాటాలని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. గురువారం కుక్కునూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోడే నాగేష్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. మండలంలోని ప్రతి పంచాయతీలో సీపీఐ జెండా ఎగరాలనే లక్ష్యంతో పనిచేయాలని, ఇతర రాజకీయ పార్టీలకు దీటుగా పార్టీ శక్తిని చాటాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను బరిలో నిలిపి గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు అయితా సురేష్ బాబు, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, మైసాక్షి వెంకటాచారి, కూరకుల బాబురావు, వరసా పాపారావు, ఎకో సోమరాజు, మడకం ఉంగా తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో తోమాల సేవ, తులాభార సేవ పునరుద్ధరణ



ఇది కద నిజం,యాదగిరిగుట్ట:శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని, తోమాల సేవతో పాటు తులాభార సేవను కూడా పునరుద్ధరించడం జరిగింది.

తోమాల సేవ వివరాలు:

టికెట్ ధర రూ. 1,250.
దంపతులకు సేవలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.
భక్తులు సంప్రదాయ వస్త్రధారణ తప్పనిసరిగా పాటించాలి.
స్వామివారి గర్భాలయ ప్రవేశ దర్శనం కల్పించబడుతుంది.
ఒక కళ్యాణం శాలువా, ఒక కండువాతో పాటు స్వామివారి అభిషేక లడ్డూ ప్రసాదం అందజేయబడుతుంది.
ప్రతిరోజూ ఉదయం నిత్య సహస్రనామార్చన అనంతరం సుమారు అరగంట పాటు తోమాల సేవ నిర్వహించబడుతుంది.

తులాభార సేవ:

భక్తుల కోరిక మేరకు స్వామివారి సన్నిధిలో తులాభార సేవను కూడా పునరుద్ధరించడం జరిగింది. భక్తులు ఈ సేవను వినియోగించుకొని తమ మొక్కులను చెల్లించుకోవచ్చు.
భక్తులు పునరుద్ధరించబడిన ఈ ఆర్జిత సేవలను సద్వినియోగం చేసుకొని శ్రీ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థానం కోరుతోంది.

యాదాద్రిలో భక్తుల సౌకర్యార్థం అదనపు ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు



ఇది కద నిజం, యాదాద్రి :పవిత్ర కార్తీక మాసం సందర్భంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రసాదాల పంపిణీ మరింత సులభతరం చేయడంతో పాటు, ప్రసాదాల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు వ్రత మండపం పరిసర ప్రాంతాల్లో అదనపు ప్రసాద విక్రయ కౌంటర్లను గురువారం ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కావున భక్తులు ఈ అదనపు కౌంటర్లను వినియోగించుకొని ప్రసాదాలను సౌకర్యవంతంగా పొందాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు.

యాదగిరిగుట్టలో వైభవంగా మణవాళ మహామునుల తిరునక్షత్ర మహోత్సవాలు





ఇది కద నిజం, యాదాద్రి :శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో మణవాళ మహామునుల తిరునక్షత్ర మహోత్సవాలు త్రయాహ్నిక దీక్షతో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రెండవ రోజు ఆచార్యుల తిరువీధి సేవ కనులపండువగా సాగింది. అధ్యాపకులు, అర్చకులు, వేదపండితుల వేదపారాయణాల నడుమ ఆలయ మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. భగవద్రామానుజుల వారి తదనంతరం శేషాంశతో అవతరించి భగవంతుని అనుగ్రహాన్ని భక్తులకు ప్రసరింపజేసిన మణవాళ మహామునుల తిరునక్షత్ర వేడుకలను దర్శించి, సేవించి ఆచార్యుల అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు కాండూరి వేంకటాచార్యులు భక్తులను కోరారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి
సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

అదనపు ఎస్పీ చెబ్రోలు లక్ష్మీనారాయణ



ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి జిల్లా: రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, మంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరులోని దినేష్ గార్డెన్స్ లో నిర్వహించిన విద్యార్థి యువ సమ్మేళనంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు ఎస్పీ చెబ్రోలు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ బెదిరింపుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా యాదాద్రి డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు , గుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ యువతకు తమ సందేశాన్ని అందించారు. ఆలేరు ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్, ఎస్‌ఐ వినయ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులు, యువతకు సైబర్ నేరాల పద్ధతులు, వాటి నివారణ చర్యలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పులిపలుకుల మహేష్ గౌడ్, మంగా ఫౌండేషన్ చైర్మన్ మంగా నర్సింహులు, బబ్బూరి పోశెట్టి, మంగా అరవింద్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఆలేరు పట్టణ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహేష్, మంగ నర్సింహులు గారిని అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



ఇది కద నిజం: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్ చంద్ మాల్వియా గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం నారసింహుడిని దర్శించుకున్న న్యాయమూర్తి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు న్యాయమూర్తి కుటుంబానికి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి లడ్డు ప్రసాదంతో పాటు చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

చిట్‌ఫండ్ వివాదాలను సివిల్ కోర్టుల పరిధిలోకి తీసుకురావాలి: అడ్వకేట్ గోసాల శ్రీనివాస రావు



ఇది కద నిజం:చిట్‌ఫండ్ చందాదారుల హక్కులు, ప్రయోజనాలకు పూర్తిస్థాయి న్యాయరక్షణ కల్పించేందుకు ఆయా వివాదాలను తిరిగి సివిల్ కోర్టుల అధికార పరిధిలోకి తీసుకురావడం అత్యంత ఆవశ్యకమని ప్రముఖ న్యాయవాది, 'స్పందన' (ఆలోచనపరుల జాతీయ వేదిక) చైర్మన్ గోసాల శ్రీనివాస రావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిట్‌ఫండ్ చందాదారులలో అత్యధికులు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు చెందినవారే ఉంటారని, లావాదేవీల్లో వివాదాలు తలెత్తినప్పుడు శక్తిమంతమైన చిట్‌ఫండ్ సంస్థల యాజమాన్యాలతో పోరాడే ఆర్థిక శక్తి గానీ, న్యాయపరమైన అవగాహన గానీ సామాన్యులకు ఉండదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చిట్‌ఫండ్ వివాదాల విషయంలో సాధారణ సివిల్ న్యాయస్థానాల అధికార పరిధిని మినహాయించి, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థ (ఏడీఆర్) ద్వారా విచారణ జరుపుతున్నారని ఆయన గుర్తుచేశారు. అయితే, న్యాయవ్యవస్థలో నేరుగా భాగం కాని ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ ద్వారా సాధారణ చందాదారులకు నిష్పక్షపాతమైన, పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందా అన్నది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయమన్నారు. అందువల్ల, చిట్‌ఫండ్ వివాదాలకు సత్వర, పటిష్టమైన పరిష్కారం లభించాలంటే తక్షణమే చట్ట సవరణ చేసి, వాటిని తిరిగి సివిల్ న్యాయస్థానాల పరిధిలోకి తీసుకురావాలని గోసాల శ్రీనివాస రావు డిమాండ్ చేశారు.

భక్తి అంటే ఏమిటి దేవుడిని కోరడమా లేక దేవుడిని అర్థం చేసుకోవడమా?

ఇది కద నిజం :మనిషి జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది దేవుడే. నా సమస్య తీరాలి నా కోరిక నెరవేరాలి నా కుటుంబం బాగుండాలి అంటూ దేవుడిని ప్రార్థిస్తాం. దేవుడి దగ్గరకు వెళ్లి మన కోరికలను చెప్పుకుంటాం. పూజలు చేస్తాం, మొక్కులు చెల్లిస్తాం. మరి ఇదే భక్తి అనుకుందామా లేక భక్తి అంటే దేవుడిని అర్థం చేసుకోవడానికి చేసే అంతరంగ ప్రయాణం గా అనుకుందామా..

భక్తి చాలాసార్లు ఒక కోరికతోనే ప్రారంభమవుతుంది. మనిషి తన శక్తికి మించిన పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు తనకంటే గొప్పదైన ఒక శక్తిని ఆశ్రయిస్తాడు. ఆ ఆశ్రయం అతనికి ధైర్యాన్ని ఇస్తుంది. అందులో తప్పేమీ లేదు. బాధలో ఉన్నప్పుడు దేవుడిని ఆశ్రయించడం కూడా మనిషి సహజమైన ఆధ్యాత్మిక అవసరమే. కానీ భక్తి అక్కడితో ఆగిపోతే అది కేవలం కోరికల జాబితాగా మారిపోతుంది. ఇచ్చిన వాటిని గుర్తించకుండా.. నేను ఇది చేస్తాను నువ్వు అది ఇవ్వాలి అనే లావాదేవీగా భక్తి మారితే, దేవుడితో మన సంబంధం కూడా ఒక వ్యాపార సంబంధంలా మారుతుంది.నిజానికి మనం దేవుడికి అర్పించేది కూడా మనకి దేవుడు సృష్టించి ఇచ్చినదే కదా..కోరిక తీరితే దేవుడిపై విశ్వాసం పెరగడం, తీరకపోతే నమ్మకం తగ్గిపోవడం అందుకు ఉదాహరణ. అయితే నిజమైన భక్తి మనలో ఒక ప్రశ్నను పుట్టించాలి..దేవుడి దగ్గర నేను ఏమి పొందాలిఅనే ప్రశ్న కంటే దేవుడిని నేను ఎలా అర్థం చేసుకోవాలి అనే ప్రశ్న.

దేవుడిని అర్థం చేసుకోవడం అంటే దేవుడి రూపం, పేరు, ఆలయం గురించి తెలుసుకోవడం మాత్రమే కాదు. మనలోని అహంకారాన్ని, స్వార్థాన్ని, కోపాన్ని, అసూయను పరిశీలించుకోవడం కూడా. మన ప్రార్థనల వల్ల మన ప్రవర్తనలో మార్పు వస్తుందా.. మనకు బాధ కలిగించినవారిని క్షమించే సామర్థ్యం పెరుగుతుందా.. ఇతరుల బాధను మన బాధగా చూడగలుగుతున్నామా ఇవే భక్తి పరిపక్వతకు కొలమానాలు.

దేవుడిని ప్రతిరోజూ పూజిస్తూ, అదే సమయంలో మనిషిని ద్వేషిస్తే ఆ భక్తిలో ఏదో లోపం ఉన్నట్టే. ఆలయంలో దీపం వెలిగించడం ఎంత ముఖ్యమో, మన ప్రవర్తనలో మానవత్వం వెలిగించడం కూడా అంతే ముఖ్యం. భక్తి మనల్ని భయపెట్టకూడదు మనలో ధైర్యాన్ని పెంచాలి. భక్తి మనల్ని ఇతరుల కంటే గొప్పవారిగా భావించేలా చేయకూడదు మరింత వినయంగా మార్చాలి. భక్తి మన కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే కాకుండా కోరికల మధ్య నిజమైన ఆత్మ తత్వం అయిన మనల్ని మనం కోల్పోకుండా ఉండటానికి కూడా తోడ్పడాలి. దేవుడిని అర్థం చేసుకోవడం అంటే చివరకు మనల్ని మనం అర్థం చేసుకోవడమే కావచ్చు. మనలోని బలహీనతలను గుర్తించడం, మన తప్పులను అంగీకరించడం, అవసరమైనప్పుడు మారడానికి సిద్ధపడటం ఇవన్నీ భక్తి యొక్క అంతరార్థంలో భాగాలే. అందుకే దేవుడిని కోరుకోవడం భక్తికి ఆరంభం కావచ్చు..దేవుడిని అర్థం చేసుకోవడం భక్తికి పరిపక్వత కావచ్చు. ప్రార్థనలో మనం మొదట నాకు ఇది ఇవ్వు అని అడుగుతాం. కాలం గడిచేకొద్దీ నాకు ఇది ఎందుకు కావాలి అని మనల్ని మనమే ప్రశ్నించుకోవడం మొదలవుతుంది. అక్కడి నుంచే భక్తి ఒక కొత్త దిశలో ప్రయాణిస్తుంది. చివరికి భక్తి అంటే దేవుడి దగ్గర మన కోరికల జాబితాను పెట్టడం మాత్రమే కాదు. మనలోని అజ్ఞానాన్ని తొలగించుకుని, జీవితం పట్ల మరింత స్పష్టతతో, ప్రేమతో, బాధ్యతతో జీవించడం కూడా భక్తే. దేవుడిని వెతుకుతూ మనిషి ఆలయానికి వెళ్లవచ్చు. కానీ దేవుడిని అర్థం చేసుకోవాలంటే తనలోకి కూడా చూడాల్సిందే. కోరికతో మొదలైన ప్రార్థన... అవగాహనగా మారినప్పుడు, అదే భక్తి యొక్క అసలైన ప్రయాణం.



– పూర్ణిమ పసుమర్తి

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 13-11-2026





శేఖర్ మాస్టర్‌కు ప్రమాదం!

టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'కాకా' చిత్రంలో పాట చిత్రీకరణ ముగించుకుని తిరిగి వస్తుండగా, శంషాబాద్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఓ మినీ ట్రక్కు ఢీకొట్టింది. వివరాల్లోకి వెళితే.. వెజిటెబుల్ లోడ్‌తో వేగంగా ఓ మినీ ట్రక్కు ఒక్కసారిగా అదుపుతప్పి శేఖర్ మాస్టర్ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతిన్నది. అయితే, అదృష్టవశాత్తు శేఖర్ మాస్టర్‌కు స్వల్ప గాయాలు కాగా.. కారులో ఉన్న మిగతా వారికి ఎలాంటి పెద్ద గాయాలు కాలేదు. దీంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడంతో ఆయన కటుంబ సభ్యులు, సినీ పరిశ్రమ వర్గాలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

పదేళ్ల ప్రేమ
ఏడడుగుల బంధం!



కోలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రియా భవానీ శంకర్ ఎట్టకేలకు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గత పదేళ్లుగా తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌తో ప్రేమలో ఉన్న ఈ భామ, నవంబర్ 11న అత్యంత నిరాడంబరంగా ఆయనను పెళ్లాడారు. చాలా కాలంగా వీరి వివాహంపై రకరకాల వార్తలు చక్కర్లు కొట్టగా, తాజాగా, ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్‌గా ఏడడుగులు వేసి కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఇక ఈ పెళ్లి వేడుకను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో మాత్రమే జరిపించారు.

హిందూ సంప్రదాయం ప్రకారం ఈ వివాహం జరిగింది. ముఖ్యంగా పెళ్లి పీటలపై రాజ్‌వెల్ రాజ్ తాళి కట్టే సమయంలో ప్రియా భవానీ శంకర్ ఎంతో సంతోషంగా మురిసిపోయారు. ఇందుకు సంబంధించిన పెళ్లి ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ విషయం తెలుసుకున్న అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు చెబుతున్నారు. పదేళ్ల ప్రేమను విజయవంతంగా పెళ్లి వరకు తీసుకెళ్లిన ఈ జంటను నెటిజన్లు అభినందిస్తున్నారు. మరికొందరు ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఉన్న డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్‌కి భిన్నంగా సింపుల్‌గా చేసుకోవడంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

పండక్కి ముందే
ప్రమోషన్ల దండయాత్ర!

సంక్రాంతి బాక్సాఫీస్ బరి అంటేనే టాలీవుడ్‌లో అతిపెద్ద యుద్ధం. ఈ పండగ సీజన్‌లో నిలబడటానికి ప్రమోషన్లు ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. అయితే, సంక్రాంతి రేసులోకి రాకముందే ప్రమోషన్ల విషయంలో మిగతా సినిమాల కంటే ఓ అడుగు ముందుంటూ సరికొత్త దూకుడు ప్రదర్శిస్తోంది 'జనవరి 12 విడుదల' చిత్ర యూనిట్. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ప్రమోషన్లను ఏకంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తూ, ప్రమోషనల్ వేటను అమెరికా గడ్డపై నుంచే మొదలుపెట్టాలని చిత్ర బృందం నిర్ణయించుకుంది.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో మొదటి నుంచే ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు చిత్ర బృందం అమెరికాలో ఇప్పటివరకు ఏ తెలుగు సినిమాకూ చేయని స్థాయిలో భారీ ప్రమోషనల్ ఈవెంట్లను ప్లాన్ చేసింది. సంక్రాంతికి ముందే ఓవర్‌సీస్ మార్కెట్‌ను తమ వైపు తిప్పుకోవడమే లక్ష్యంగా మొత్తం చిత్ర యూనిట్ అమెరికాకు పయనం కానుంది. డిసెంబర్ నెలాఖరులో ప్రవాసాంధ్రుల సమక్షంలో భారీ ఎత్తున ప్రమోషన్లు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 26, 27 చికాగో నగరంలో గ్రాండ్ ప్రమోషనల్ ఈవెంట్లు, తర్వాత డిసెంబర్ 29, 30, 31 ఆస్టిన్, డల్లాస్ నగరాల్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌తో కూడిన ప్రమోషన్లను మేకర్స్ ప్లాన్ చేశారు. పండగ సీజన్‌కు ముందే యూఎస్ బాక్సాఫీస్ వద్ద భారీ హైప్ క్రియేట్ చేయాలనే పక్కా వ్యూహంతో మేకర్స్ ఈ టూర్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది.



ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి జీ.వీ. ప్రకాష్ కుమార్ బాణీలు సమకూరుస్తున్నారు. విడుదల తేదీని టైటిల్‌లోనే పెట్టుకున్న ఈ సినిమాను 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఇతర సంక్రాంతి చిత్రాలు ఇంకా ప్రమోషన్స్ ఆలోచనల్లో ఉండగానే, విదేశాల్లో భారీ ఈవెంట్లతో 'జనవరి 12 విడుదల' టీమ్ చూపిస్తున్న ఈ దూకుడు పండగ రేసులో సినిమాకు భారీ ఓపెనింగ్స్ అందించడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.

పెళ్లి చేసుకుని విడిపోతారా?

ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటించిన ఇడుపు కాయితం సినిమా టీజర్ విడుదలైంది. తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో తీసిన ఈ సినిమా పెళ్లి ఆ తరవాత జరిగిన కొన్ని పరిణామాల కారణంగా విడాకులు తీసుకోవడం నేపథ్యంలో తెరకెక్కింది. తాజాగా విడుదల చేసిన టీజర్‌లో.. పెళ్లి చూపులు, ఆ తరవాత కొత్తజంట మధ్య ఉండే బంధాన్ని చక్కగా చూపించారు. చివరికి ఇద్దరూ విడాకులు తీసుకుంటున్నట్టు ప్రకటించి ట్విస్ట్ ఇచ్చారు. అచ్చమైన ఊరివాతావరణంలో జరిగే కథలా ఇడుపుకాయితం కనిపిస్తోంది. ఇక ఈ సినిమాకు వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహించగా, సురేష్ బొబ్బిలి మ్యూజిక్ అందించారు.



సినిమాలో అభినవ్ గోమటం, అభయ్, శివజ్యోతి, బిత్తిరిసత్తి సహా ఇతరులు నటించారు. సుకుమార్ రైటింగ్స్ అండ్ బన్నీవాస్ బ్యానర్లు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే ఈ చిత్రానికి పబ్లిసిటీ పీక్స్ లో వచ్చిన సంగతి తెలిసిందే. సినిమా నుండి విడుదల చేసిన పాటలు కూడా ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాను డిసెంబర్ 11న విడుదల చేయనున్నారు. సినిమా ఎలా ఉందో తెలియాలంటే అప్పటి వరకు వెయిట్ చేయాల్సిందే.

గ్రీస్‌లో గ్రాండ్ వెడ్డింగ్

సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ పెళ్లి గ్రీస్‌లో ఘనంగా జరిగింది. నిన్న తమ తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫొటోలు సైతం పంచుకున్నారు. ఇప్పుడు సినీ ఇండస్ట్రీ, క్రికెట్ ప్రపంచంలోఈ పెళ్లి హాట్ టాపిక్‌గా మారింది. ఈ గ్రాండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ వేడుకలకు అతిరథ మహారథులు క్యూ కట్టారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సూపర్ స్టార్ రజినీకాంత్ ఈ పెళ్లికి హాజరయ్యారు. నవంబర్ 10 అందమైన శాంటోరిని ద్వీపం సమీపంలో ఈ వివాహ వేడుక కొనసాగింది. అయితే.. అసలు ఈ పెళ్లికి ఎంత ఖర్చు చేశారు? ఈ వివాహం ప్రత్యేకతలు ఏంటి? అనే విషయాలను తెలుసుకుందాం..

ప్రకృతి అందాలు, గొప్ప సంస్కృతి, అద్భుతమైన ఆతిథ్యం కలగలిసిన గ్రీస్.. ప్రపంచంలోనే అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. ఇక, గ్రీస్‌లో పెళ్లికి వచ్చిన అథితుల రాకపోకల కోసం మారన్ కుటుంబం ఏకంగా నాలుగు ప్రైవేట్ విమానాలు, లగ్జరీ వసతి, లోకల్ ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు చేసినట్లు ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఏ పెళ్లిలోనైనా ఆహారమే ప్రధాన ఆకర్షణ. గ్రీక్ వంటకాల్లో తాజా కూరగాయలు, సీఫుడ్, నాణ్యమైన మాంసాహారంతో పాటు వెజిటేరియన్, వీగన్ ఆహార ప్రియులకు తగ్గట్టుగా ఎన్నో రకాల సంప్రదాయ రుచులు అందుబాటులో ఉంటాయి. వీటికి తోడు స్థానికంగా తయారయ్యే విడియానో, మస్కాటో స్పినాస్ వంటి వైన్లు, ఊజో, మస్తిహా వంటి సంప్రదాయ డ్రింక్స్ వేడుకలకు గ్రీక్ టచ్ ఇస్తాయి. నివేదికల అంచనాల ప్రకారం, ఈ లగ్జరీ వెడ్డింగ్‌లో కేవలం ఒక్క వ్యక్తికి పెట్టే భోజనం లేదా ఒక ప్లేట్ ధర సుమారు రూ. 15,000 నుంచి రూ. 35,000 వరకు ఉంటుందట. ఈ వేడుకకు హాజరైన రాజకీయ, సినీ, క్రీడా దిగ్గజాల ఫుడ్ మెనూ కోసమే కోట్లాది రూపాయలు ఖర్చు చేశారట. ఇక ఈ వెడ్డింగ్‌కు కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు పలు కథనాలు చెబుతున్నారు.



అసలు ఇంత మంది సెలబ్రిటీలు, సంపన్నులు తమ జీవితంలోని ముఖ్యమైన వేడుకల కోసం గ్రీస్‌నే ఎందుకు ఎంచుకుంటున్నారు? అక్కడ అంత ప్రత్యేకత ఏముందో తెలసుకుందాం.. గ్రీస్‌లో ఏడాదిలో దాదాపు 300 రోజుల పాటు ఆహ్లాదకరమైన ఎండ, నిర్మలమైన నీలి ఆకాశం ఉంటాయి. ఈ మధ్యధరా వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా అవుట్‌డోర్ వెడ్డింగ్స్ ప్లాన్ చేసుకోవచ్చు. సముద్రపు ఒడ్డున కొండ అంచున అయినా, పచ్చని ప్రకృతి మధ్య అయినా రిసెప్షన్లకు గ్రీస్ అద్భుతమైన వేదికగా నిలుస్తుంది. ఇక పెళ్లి ఫోటోగ్రఫీ విషయానికొస్తే, ఇది జంటలకే కాదు ఫోటోగ్రాఫర్లకు కూడా ఒక డ్రీమ్ లొకేషన్. పురాతన కట్టడాలు, తెల్లని భవనాలు, అందమైన తీర ప్రాంతాల నేపథ్యంలో తీసే ఫోటోలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ సూర్యాస్తమయపు 'గోల్డెన్ అవర్' వెలుతురులో ఫోటోలు మరింత మాయాజాలం చేస్తాయి.